క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో మార్చి 5వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామ వర ప్రసాదరావు, ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు సోమవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

గడువులోపే అర్జీలను పరిష్కరించాలి



నూజివీడు: స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో 14 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఏడీఏ విద్యాసాగర్, హెచ్‌ఓ హేమ, ఐసీడీఎస్ సీడీపీఓ శేషుకుమారి పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ముసునూరు: అనారోగ్యంతో విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన వడ్లపట్ల రామకృష్ణకు వలంటీరు ముళ్లపూడి నిర్మలకుమారి ఆదివారం రాత్రి గ్రామ సర్పంచ్ సీహెచ్ దామోదర్, ఉప సర్పంచ్ డీవీ సుబ్బారావుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో వలంటీర్‌ను సొసైటీ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మల్లినేని మురళి అభినందించారు.

బీమా చెక్కు పంపిణీ



చాట్రాయి: మండలంలోని సి.గుడిపాడు గ్రామానికి చెందిన గార్లపాటి ఏసు ఆదివారం మృతి చెందారు. అంత్యక్రియల నిమితం వైఎస్సార్ బీమా చెక్కు రూ.10 వేలు ఏసు భార్య సరోజినికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు విస్సంపల్లి సీతయ్య పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యపై ఫిర్యాదు



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట కోటపాడు మెయిన్ రోడ్డుపై పారుతోన్న మురుగు నీటిని తొలగించాలని సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్. మురళీమోహన రావుకి ఫిర్యాదు చేశారు. అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణోత్సవం



విస్సన్నపేట: స్థానిక గోపరాజు సమేత లక్ష్మీతిరుపతమ్మవారి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దంపతులు సాధుపాటి నాగమల్లేశ్వరి, కోటేశ్వరరావు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ముసునూరు: మైలవరంలోని ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ముసునూరు విద్యార్థి చిట్టూరి యశ్వంత్‌కు గ్రామానికే చెందిన ప్రవాసాంధ్రుడు దేవినేని సాంబశివ వరప్రసాద్ ద్వారా ప్రముఖ దాత గ్రామ వాసి దేవినేని విజయనారాయణ రూ.20,000 సాయం చేశారు. దాత సోదరులు దేవినేని వీరభద్రం, వరప్రసాద్ సోమవారం నగదు చెక్కును విద్యార్థికి అందజేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రక్షణనిధి



లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: సామాజిక అసమానతల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి సూచించారు. తిరువూరు 9వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో వివిధ సంక్షేమ పథకాల ద్వారా సమకూరిన లబ్ధితో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ప్రతి కుటుంబం జీవనోపాధి మెరుగుపరచుకునేందుకు ఈ పథకాలు తోడ్పడతాయని ఎమ్మెల్యే తెలిపారు. తిరువూరు పట్టణంలో అభివృద్ధి పనులను సైతం అమలు చేస్తున్నామని, ఇంటింటికీ రక్షిత మంచినీరందించే ధ్యేయంతో కృష్ణా నదీ జలాలను రూ.160 కోట్ల వ్యయంతో సరఫరా చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని వార్డులలో సీసీ రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధికీ తగు నిధులను కేటాయిస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్లు దుర్గారావు, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ప్రసాద్, ప్రకాష్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదినారాయణ, రఫీ, నెహ్రూ పాల్గొన్నారు.

తలశిల రఘురామ్‌కు పరామర్శల వెల్లువ



రఘురామ్‌ను పరామర్శిస్తున్న శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు ప్రజాప్రతినిధులు, ప్రముఖుల పరామర్శలు వెల్లువెత్తాయి. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో ఆదివారం మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం రాత్రి ఎన్టీఆర్‌జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఆయన నివాసానికి వచ్చి రఘురామ్, కుటుంబసభ్యులను పరామర్శించారు. సోమవారం కూడా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు వచ్చి స్వర్ణకుమారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. వారిలో మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, మేరుగ నాగార్జున, ఎంపీ నందిగామ సురేష్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), పుష్పాల శ్రీనివాసరావు (వాసు), దూలం నాగేశ్వరరావు, మొండితోక జగన్‌మోహన్‌రావు, అనిల్‌యాదవ్, ధర్మాన కృష్ణదాస్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవికుమార్, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ అంకమరెడ్డి నారాయణమూర్తి, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, జూపూడి ప్రభాకర్, రాయపాటి శ్రీనివాసరావు, సుంకర పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. అలాగే ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఎంపీటీసీ ధనేకుల చౌదరి, గొల్లపూడి సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు గంగవరపు శివాజీ, బొర్రా తిరుపతిరావు, జాస్తి జగన్, గేరా సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ఎంపీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ఇబ్రహీంపట్నం: రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సోమవారం ప్రదర్శించారు. ఆ సంస్థ ఎస్ఎఫ్ఎంటీ కె.నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రసాయన రహిత పంటలు ఆరోగ్యానికి మేలన్నారు. స్టాల్‌లో తోటకూర, మెంతుకూర, చుక్కకూర, సొర, బెండ, దోస, వంగ, టమాటా ఉత్పత్తులు ప్రదర్శించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

గంపలగూడెం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించే ఉత్పత్తులు ఆరోగ్యకరం అని మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ తెలిపారు. గంపలగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన ఆకు కూరలను ప్రదర్శన నిర్వహించారు. ఈ పద్ధతి ద్వారా పండించిన కూరగాయాలు, ఆకు కూరలు, ఆహార ధాన్యాలు, ఇతర ఉత్పత్తులను ప్రజలు ఉపయోగించడం ద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వీఏఏ జి ప్రతాప్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది కోటేశ్వరమ్మ, విజయలక్ష్మి, స్వాతి, చిదంబరం, పుష్పలత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యేను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నల్లమోతు మధుబాబుపై వైఎస్సార్ సీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబ సభ్యులను దూషించడం దారుణమంటూ వైఎస్సార్ సీపీ నాయకులు సీఐ పి.శ్రీనుకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, నాయకులు శివారెడ్డి, దుర్గాప్రసాద్, అంకమోహనరావు, చిన్నయ్య, ఎస్.శివశంకరరావు, గాంధీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వసంతపై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

రెడ్డిగూడెం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నల్లమోతు మధుబాబును వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ-2 శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వీరస్వామినాయుడు, వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సుధాకర్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు గాలీబ్ సహబ్ షాహిద్, బొల్లారెడ్డి అంజిరెడ్డి, వీరంకయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి మధుకు లేదు

మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను విమర్శించే స్థాయి ఇబ్రహీంపట్నానికి చెందిన నల్లమోతు మధుబాబుకు లేదని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధుబాబుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మధుబాబు వైఖరిపట్ల ఎమ్మెల్యే అభిమానులమైన తాము తీవ్ర మనోవేదనకు గురయ్యామని పేర్కొన్నారు. అధిష్టానం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, జీ.సాంబిరెడ్డి, బుర్రి ప్రతాప్, షేక్ మమ్ము, ప్రతాపరెడ్డి, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, యేసు పాల్గొన్నారు.

జాతీయ సంపదను అదాని పరం చేస్తున్న మోదీ

మైలవరం: జాతీయ సంపదను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లు అదాని తదితరులకు దోచిపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఆరోపించారు. అదాని అక్రమ వ్యాపారాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మైలవరం ఎస్‌బీఐ కార్యలయం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు ఏసుదాసు, చిలుకూరు సర్పంచ్ సురేష్, రామకృష్ణ, గిరికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాబా చూపిన మార్గంలో నడవాలి

ఎ.కొండూరు: బాబా చూపిన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించి వారి అడుగుజాడల్లో నడవాలని ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహీద్దీన్ షా ఖాదరి పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో ఆదివారం రాత్రి సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరి బాబా పరమపదించిన రోజు తేరవి షరీఫ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాజా మొహీద్దీన్ మాట్లాడుతూ బాబా చూపిన మార్గమే మనకు ఇహ పరలోక సంపద అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయనగరం మహనీయులు ఖాదర్‌బాబా దర్గాలో కూడా ఆ దర్బార్‌లో పీఠాధిపతి మహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులు బాబా మహాదివ్య సమాధిని దర్శించుకుని చాదర్, పూలు, గంధం సమర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గులాబ్ జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నెమలి దేవస్థానంలో అభివృద్ధి కట్టడాల ప్రారంభం

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో దాతల విరాళాలతో నిర్మించిన పలు అభివృద్ధి కట్టడాలను సోమవారం ప్రారంభించారు. దాతల సమక్షంలో ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి. శ్రీరామ వర ప్రసాదరావు ఆయా కట్టడాలు, అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఇటీవల కాలంలో దాతల సహకారంతో రూ. 54 లక్షల వ్యయంతో నిర్మించిన ముఖ ద్వారం, కాళీయ మర్దన ముఖ ద్వారం తదితర అభివృద్ధి పనులను దాతల సమక్షంలో ప్రారంభించారు. దాతలను చైర్మన్ సన్మానించారు. పాలకవర్గ సభ్యులు నాగలక్ష్మీరావ్, వెంకటకృష్ణ, రాధాకృష్ణ, నరసింహారావు, వీర ప్రసాద్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో భూ రీ సర్వే ప్రారంభం

నూజివీడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సోమవారం మండలంలోని గొల్లపల్లిలో భూముల రీసర్వేను తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు ప్రారంభించారు. భూములను డ్రోన్ కెమెరా ద్వారా కచ్చితమైన సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించనున్నట్టు ఆయన తెలిపారు. సర్వే పూర్తయిన రెండు, మూడు వారాల తర్వాత భూముల చిత్రపటాలు వస్తాయని, ఆ చిత్రపటాలతో గ్రామ సర్వే బృందం భూముల సర్వే చేస్తారని చెప్పారు. దీనికి భూ యజమానులందరూ సహకరించాలని కోరారు. సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్‌లు ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లారి రాఘవ, వీఆర్వో వీరయ్య, సుబ్బలక్ష్మి, గ్రామ సర్వేయర్ వంశీకృష్ణ, సర్వే ఆఫ్ ఇండియా పైలెట్ ఒ.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలం ఆదాయం ఇచ్చే పంట పామాయిల్

గణపవరం(మైలవరం): దీర్ఘ కాలం స్థిరమైన ఆదాయం ఇచ్చే పంట పామాయిల్ అనువైనదని ఉద్యాన శాఖ మైలవరం మండల ఇన్‌చార్జి సోహైల్ అహ్మద్ తెలిపారు. మైలవరం మండలం గణపవరం గ్రామం రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే)లో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు వివరించారు. మొక్క ఖరీదులో నూరు శాతం రాయితీ, సాగు ఖర్చులకు హెక్టార్‌కు రూ. 21వేలు నాలుగు సంవత్సరాలు పాటు అందజేస్తారన్నారు. అంతే మొత్తంలో అంతర పంటలకు రాయితీ ఉంటుందన్నారు. పతంజలి ఫుడ్స్ ఎన్టీఆర్ జిల్లా డీజీఎం వీరేంద్ర చౌదరి, జనరల్ మేనేజర్ కొండారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రాంబాబు, లక్ష్మీనారాయణ, ఉద్యాన సహాయకులు మహేష్, రైతులు పాల్గొన్నారు.

రేపు ఆటల పోటీలు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీన లహరి కార్యక్రమంలో భాగంగా లిటరరీ, కల్చరల్, స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం, వ్యాస రచన, గ్రూప్ డ్యాన్స్, గ్రూప్ సాంగ్స్, వాలీబాల్(బాలురకు) టెన్నికాయిట్(బాలికలకు) బాల్‌బాడ్మింటన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

ఆగిరిపల్లి: మండలంలోని ఆగిరిపల్లి, బొద్దనపల్లి గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లో ఈ నెల 7, 8, 9, 10 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. పూర్తి వివరాలకు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

120 మందికి కంటి పరీక్షలు

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో సోమవారం భగవాన్ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వైద్యులు జెమ్మత్ షాహిన్ 120 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ట్రస్టు అధ్యక్షుడు జె.రంగారెడ్డి, క్యాంప్ చైర్మన్ వనమా హేమ సుందరావు పాల్గొన్నారు.

వర్క్‌బుక్ తప్పక పూర్తి చేయాలి

మేడూరు(గంపలగూడెం): విద్యార్థులు రోజూ తప్పకుండా వర్క్‌బుక్ పూర్తిచేసేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. గంపలగూడెం మండలం మేడూరు ఎలిమెంటరీ పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల సామర్థ్యం, రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పలు రికార్డులను సక్రమంగా నిర్వర్తించకపోవడం గుర్తించి వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఫేషియల్ రికగ్నైజేషన్‌ను ఉపాధ్యాయులు తప్పక పాటించాలన్నారు. లేని పక్షంలో మెమోలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. హెచ్ఎం కోట వెంకటేశ్వరరావు, ఇషాక్, సీఆర్పీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బెల్లం విక్రేతల అరెస్ట్



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం

తిరువూరు: సారా నియంత్రణలో భాగంగా తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం విస్తృత దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం తాతకుంట్ల తండా, చంద్రుపట్ల తండాలో సారా తయారీకి అవసరమైన బెల్లం సరఫరా చేస్తున్న ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన కొత్తగుండ్ల ప్రభాకరరావును, రెడ్డిగూడెం మండలం సీతారాంపురానికి చెందిన భరోతు కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ గురవయ్య తెలిపారు. ఇరువురి వద్ద 554 కిలోల బెల్లం, మారుతీ కారు, మినీ వ్యాను స్వాధీనం చేసుకుని తిరువూరు కోర్టులో హాజరు పరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు. సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేసే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

10న కోట శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

నూజివీడు: స్థానిక డీఏఆర్ కళాశాల వద్ద ఉన్న కోట లోపలున్న శివాలయంలో ఈ నెల 10న ఉదయం 8.49 గంటలకు స్వామి పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ సోమవారం తెలిపారు. ప్రతిష్ఠ అనంతరం ఉదయం 11 గంటలకు దుర్గామల్లేశ్వరస్వామి శాంతి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా 8, 9 తేదీల్లో మహాగణపతి హోమం, గోపూజ, యాగశాల హోమాలు నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి సంచార ఆధార్ నమోదు సేవలు

ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల్లో మంగళవారం నుంచి గురువారం వరకు సంచార ఆధార్ నమోదు సేవలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ సోమవారం తెలిపారు. 7, 8 తారీఖుల్లో మూలపాడు జెడ్పీ పాఠశాల, కొటికలపూడి ఎంపీయూపీ పాఠశాల, తుమ్మలపాలెం ఎంపీపీ పాఠశాలలో ఆధార్ నమోదు చేస్తారని పేర్కొన్నారు. 9న కాచవరం ఎంపీపీ పాఠశాల, 10న దాములూరు ఎంపీపీ పాఠశాల, 9, 10న కేతనకొండ జానెట్ డిగ్రీ కళాశాల, గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో ఆధార్ సంచార కేంద్రాల ద్వారా విద్యార్థులకు ఆధార్ నమోదు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశం విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

శ్రీచరణ్‌కు మంత్రి జోగి రమేష్ అభినందన



శ్రీచరణ్‌ను అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

ఇబ్రహీంపట్నం: మండలంలో కేతనకొండకు చెందిన పులి శ్రీచరణ్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సోమవారం అభినందించారు. జనవరి 26న ఢిల్లీలో జరిగినగణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆంధ్ర, తెలంగాణ యూనిట్ మచిలీపట్నం నుంచి అర్హత సాధించి పెరేడ్‌లో పాల్గొన్నాడు. స్వగ్రామానికి చేరుకున్న శ్రీచరణ్‌కు గ్రామస్తులు స్వాగతం పలికారు. తల్లిదండ్రులతో కలసి మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పరేడ్‌లో జరిగిన అంశాలు మంత్రి తెలుసుకున్నారు. ఇప్పటికే కరాటేలో ప్రతిభ చాటుతున్న శ్రీచరణ్ మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఘనంగా వేంకటాచలస్వామి నగరోత్సవం



వేంకటాచలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో తిరు కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి నగరోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి తిరుకల్యాణాన్ని ఉభయదంపతులు పీటలపై కూర్చుని జరిపించారు. తొలుత కొఠాయి మంటపం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావు, మేనేజరు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. వేదపండితులు దివి ఉదయకుమారాచార్యులు, ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలకృష్ణమాచార్యులు, ఎస్ సీహెచ్ విఠలాచార్యులు కల్యాణోత్సవం జరిపించారు. ఏసీపీ రమేష్, తిరువూరు సీఐ భీమరాజు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, పద్మారావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మహిళలు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న పద్మ

మైలవరం: మహిళలు స్వయం ఉపాధితో తమ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. మైలవరం మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెల్వడం గ్రామానికి చెందిన కుడుముల పద్మజ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రవాసాంధ్రులు కుడుముల వెంకట నారాయణరెడ్డి సహకారంతో ట్రస్టు కార్యాలయంలో మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు సోమవారం ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలను మైలవరం మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టు గౌరవాధ్యక్షురాలు ప్రొఫెసర్ పద్మ(యూఎస్ఏ) మాట్లాడుతూ మహిళలు ఉపాధి పొందడానికి చక్కటి అవకాశమని, స్వయంగా ఆర్థిక అభివృద్ధి పొందాలన్నారు. ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ 45 రోజుల శిక్షణ కార్యక్రమం అని 80మందికి ఉచితంగా శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, పద్మజ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి గోపాలరావు, మోస్ట్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ వసుకుమార్, మిక్కిలి సాంబశివరావు, కోటేశ్వరరావు, శిక్షకులు కృష్ణకుమారి, షహీదా పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులను ఆదరించాలి

గణపవరం(మైలవరం): హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తుల పట్ల ప్రేమతో మెలగాలని, నిరాదరణకు గురిచేయకూడదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎల్. సురేష్‌కుమార్ తెలిపారు. మైలవరం మండలం గణపవరం గ్రామ విలేజ్ క్లినిక్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ వి.సుందరరావు, ఆరోగ్య సిబ్బంది రూతమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

పురుగు మందు కొడితే పంట నాశనం

గంపలగూడెం: తనకు చెందిన 3.07 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్నకు ఆశించిన పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తే పంట నాశనం అయిందంటూ అనుముల్లంకకు చెందిన రైతు వెంకటరెడ్డి స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో బాధిత రైతు తనకు నష్టపరిహారం ఇప్పించాలని, ఇప్పటికే నెలరోజు వయస్సు మొక్కజొన్నకు రూ.70వేలకు పెట్టుబడి పెట్టాను అని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చెన్నవరానికి చెందిన రైతు శ్రీనివాసరావు తన వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని, రైతు భరోసా సాయం తనకు బ్యాంకు అకౌంట్లలో జమ కాలేదంటూ అర్లపాడుకు చెందిన ఎ.నాగమణి మరో దరఖాస్తు ఇచ్చారు. సామాజిక పెన్షన్ మంజూరు చేయాలంటూ కనుమూరుకు చెందిన యరసాని దరఖాస్తు ఇచ్చారు. గృహాలకు ప్రభుత్వం అందజేస్తున్న సాయం పెంచాలని కోరుతూ సీపీఐ మండల శాఖ కార్యదర్శి నాగుల్‌మీర ఆధ్వర్యంలో పార్టీ తరపున వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ పిచ్చిరెడ్డి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, ఏఓ బి.సాయిశ్రీ, గృహ నిర్మాణ శాఖ ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

దాడి సంఘటనలో ఐదుగురికి గాయాలు

నూజివీడు: పంచాయతీ విషయమై ఇరువర్గాలు మాట్లాడుకోవడానికి రాగా, ఒక వర్గం మరోవర్గంపై దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాజిల్లా గన్నవరం మండలం బీబీగూడెంకు చెందిన అప్పికట్ల రామకృష్ణకు, ఆగిరిపల్లి మండలం జల్లి కొండయ్య అనే వ్యక్తి మధ్య వివాదం నెలకొంది. దీనిపై ఇరువర్గాలు నూజివీడు మండలం అన్నవరం సమీపంలోని మామిడితోటల్లో సోమవారం పంచాయితీ పెట్టుకున్నారు. పంచాయితీలో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో సాయంత్రం సమయంలో ఒక వర్గం వారు కర్రలు, బీరు సీసాలు తదితర వాటితో దాడి చేశారు. దీంతో ఆగిరిపల్లికి చెందిన జల్లి నాగరాజు, వడ్లమానుకు చెందిన పాలపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి నాగరాజు, కనసానపల్లికి చెందిన కొమ్మా ఏసుదాసు, కమ్మా జోజిలకు గాయాలయ్యాయి. వీరు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు సమాచారం అందలేదని పేర్కొన్నారు.